
ప్రజాశక్తి
శనివారం 22 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం



జిందాల్ కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి- కొత్తవలస

జిందాల్ పరిశ్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ జిందాల్ ఎంప్లాయిస్, కాంట్రాక్టు వర్కర్స్ జెఎసి ఆధ్వర్యాన శుక్రవారం ఆ పరిశ్రమ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం లాకౌట్ పేరుతో కార్మికులను బయటకు నెట్టేసిందని ఆగ్రహం వ్యకంచేశారు. 36 రోజులుగా కార్మికులు నిరసన చేపడుతున్నా కనీసం స్పందించలేదని మండిపడ్డారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతామని స్పష్టంచేశారు. జెఎసి నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు అండగా తామంతా ఉన్నామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.






ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

జిల్లాకు చెందిన శాసన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అమరావతిలో శుక్రవారం జరిగింది. శాసనసభలో ప్రోటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి వీరితో ప్రమాణం చేయించారు. జిల్లాకు సంబంధించి మంత్రి హోదాలో రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ముందుగా శాసన సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అక్షరమాల ప్రకారం పేర్లను పిలవగా, కురుపాంకు చెందిన మహిళా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రమాణం చేశారు. ఆ తర్వాత పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.



వంటింట్లో కూరల మంట

- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- తారెక్కిస్తున్న టమాటా

ఎండల్లా మండిపోతున్నాయి



కూరగాయల ధరలు ఎండలు కంటే దారుణంగా మండిపోతున్నాయి. టమోట ధరలు గత ఆరు నెలల్లో ఇంత ఎక్కువ పెరగడం ఎప్పుడూ చూడలేదు. రైతు బజార్‌లో దొరికితే పరవాలేదు. ఇదే బయట కొనుకుంటే కేజీ 80 నుంచి 90 రూపాయల వరకు ఉంది. దీనికి తోడు ఉల్లిపాయలు, కాయగూరల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. అల్లం, వెల్లుల్లి ధరలు ఇక్క చెప్పక్కర్లేదు. ప్రభుత్వం గతంలో మాదిరిగా ఏదైనా సబ్సిడీ రూపంలో విక్రయిస్తే బాగున్ను.

- ఎన్ని నాగమణి, విటి అగ్రహారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. రూ.500 పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. ముఖ్యంగా టమాటా, పచ్చిమిర్చి, వెల్లుల్లి, కొన్ని రకాల కూరగాయల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఇప్పటికే ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులతో ఇబ్బంది పడుతున్న ప్రజలు కూరగాయల రేట్లు పెరగడంతో మరింత ఇక్కట్లు పడుతున్నారు. చాలా మంది కేజీ కొనేవారు.. అరకేజీ కొంటున్నారు. అరకేజీ కొనేవారు పావుకేజీ కొంటున్నారు. విరివిగా వాడే టమాటా ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు లబోదిబోమంటున్నారు. మొన్నటి వరకు కిలో రూ.30 నుంచి రూ.40 పలికిన టమాటా ఇప్పుడు ఏకంగా కిలోకు రూ.80 అయింది. రైతు బజారులో దీని ధర కేజీ రూ.70 ఉంది. మొన్నటివరకు ఉల్లిపాయలు కేజి 55 ఉండగా, తాజాగా బయట మార్కెట్‌లో రూ.45, రైతు బజారులో రూ.37 ఉంది. ఉల్లిపాయలు కేజీ 15 నుంచి 20 రూపాయల వరకు ఉండేవి, ఇప్పుడు అవి కేజీ రైతు బజార్లో రూ.37 అవ్వడంతో బయట మార్కెట్‌లో రూ.45 నుంచి రూ.50 మధ్య అమ్ముతున్నారు. టమాటా రైతు బజార్‌లో కేజీ 70 ఉంటే బయట మార్కెట్‌లో రూ.80పైగా అమ్ముతున్నారు. కాయగూరలు వంకాయి, చిక్కుడు, బెండ, దొండకాయలు ఇలా అన్నింటి ధరలూ రూ.40పైనే ఉన్నాయి. వర్షాభావంతో కాయ గూరల పంటలు సాగవ్వకపోవడంతో ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

ఆకుకూరల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. పాలకూర, తోటకూర, గోంగూర, పొన్నగంటికూర, బచ్చల కూర, మెంతికూర, కొత్తిమీర, ధరలు భారీగా పెరిగాయి. బీరకాయలు, వంకాయలు, గోరు చిక్కుడు, దొండకాయలు అన్నింటి ధరలూ అదేవిధంగా ఉన్నాయి. మరోవైపు కోడికూర, కోడి గుడ్డు ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. కిలో చికెన్ రూ.250 ఉండగా కోడి గుడ్డు ఒక్కటి రూ.6 నుంచి రూ.7 ఉంది.



రైతుబజారులో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

కూరగాయలు రకం	కేజి ధర
వంకాయలు (తెలుపు)	45.00
వంకాయలు (రవివంగ)	33.00
వంకాయలు (నల్లవంగ)	33.00
టమాట (దేశవాలి)	70.00
బెండకాయలు	44/50
కాకరకాయలు	40.00
బీరకాయలు	45.00
క్యాబేజి	32.00
పొడుగు చిక్కుడు/బర్బాటి	60.00
క్యారెట్	33.00
దొండకాయలు	40.00
బీట్ రూట్	36.00
ఉల్లిపాయలు	37.00
బంగాళదుంపలు	34.00
అల్లం	185.00
పచ్చిమిర్చి	50/60
వెల్లుల్లి	200.00
గోరుచిక్కుడు	50.00
కేప్సికం	96.00
కీరదోసకాయలు	40.00
కందదుంపలు	70.00
చామదుంపలు	50.00
ఫ్రెంచ్ బీన్స్	85/110
పొటల్స్	45.00
ఆగాకర	100.00
ముల్లంగి దుంప	30.00

నగరంలోని మూడు రైతుబజార్లలో శనివారం నుంచి కిలో టమాట రూ.60, ఉల్లిపాయలు, బంగాళదుంపలు రూ.30 చొప్పున విక్రయించనున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఈమేరకు నగరంలోని హోల్‌సేల్ వర్తకులతో శుక్రవారం సమావేశమయ్యారు.

వారం రోజుల్లో సబ్సిడీపై టమాటా సరఫరా



అన్ సీజన్‌లో మూడు నెలల పాటు కూరగాయలు, ఉల్లిపాయలు, టమోటో పంటల సాగు సాధారణంగా ఉంటుంది. అందువల్ల కొరత ఏర్పడుతోంది. ప్రస్తుతం టమాట స్థానికంగా సాగవ్వకపోవడంతో చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు ప్రాంతం పోలార్ పరిసర ప్రాంతాల నుంచి టమాటాను దిగుబడి చేసుకుంటున్నాం. ఇవి అక్కడే కేజీ 55 రూపాయల నుంచి 56 వేల రూపాయల వరకు ఉంటుంది వీటిని అక్కడ కొనుగోలు చేసి అంతే ధరకు వినియోగదారులపై భారం పడకుండా విక్రయిస్తున్నాం. వారం పది రోజుల్లో సబ్సిడీపై టమోటాను ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం ఉల్లిపాయలు మన ప్రాంతంలో లేకపోవడంతో మహారాష్ట్ర నుంచి పాత ఉల్లి తెప్పించి 32 నుంచి 35 రూపాయలకు అమ్ముతున్నాం. మన రాష్ట్రంలో కర్నూల్ మార్కెట్‌కు కొత్త ఉల్లి వచ్చేవరకు ధరలు ఇలాగే ఉంటాయి.

- రవికిరణ్,
అసిస్టెంట్ డైరెక్టర్, రైతు బజార్లు

అక్రమంగా ఇసుక తవ్వకాలు

లారీ, పొక్లైనర్లు స్వాధీనం చేసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

ప్రజాశక్తి - కొమరాడ

ఎటువంటి అనుమతులేకుండా జంఝావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ రమేష్ అన్నారు. శుక్రవారం ఉదయం జంఝావతి నది రైల్వే వంతెన సమీపంలో చైన్ ప్రొక్లైన్ సహాయంతో లారీలో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు రెవెన్యూ అధికారుల సహాయంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. రైల్వే వంతెనల పనుల్లో భాగంగా ఎటువంటి అనుమతులు లేకుండా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలించి డంపింగ్ చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఒక చైన్ పోక్లైన్‌తో పాటు లారీని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో పెట్టమని తెలిపారు. వంతెన సమీపంలో ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగకూడదని ప్రభుత్వ నిషేధం ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వకాలు చేసి తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. రైల్వే వంతెన పనులు కోసం ఇసుకను తీస్తున్నామని కాంట్రాక్టర్ రెవెన్యూ అధికారులతో చెప్పినప్పటికీ ఎటువంటి అనుమతులు లేకపోవడంతో అధికారులు వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్కు అప్పగించారు. మండలంలోని ఇసుక అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు ఇసుక తవ్వుతున్న ప్రదేశంలో పెద్దపెద్ద గుమ్ములు తవ్వుతుండడంతో భవిష్యత్తులో ప్రమాదాలు పొంచి ఉన్నాయని సమీప గ్రామాల ప్రజలు అంటున్నారు. మండలంలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతుల్లేవని ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని రెవిన్యూ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇసుకను తరలిస్తున్న ప్రదేశాన్ని రెవెన్యూ అధికారులు, పోలీసులు సందర్శించి నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఎఎస్ఐ నాయుడు, ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఒ మహీపతి, వంశీ, రవి, పోలీసులు ఉన్నారు.



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

యమపాశాలను తలపిస్తున్న విద్యుత్ తీగెలు

భయం గుప్పెట్లో రైతులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగెలు కిందకు వేలాడుతూ యమపాశాలను తలపిస్తున్నాయి. మండలంలోని బుడ్డిపేటలో గల తోటపల్లి కెనాల్ కుడివైపు గల పొలంలో కొన్ని నెలలుగా విద్యుత్ తీగెలు కిందకు వేలాడుతున్నాయి. వీరిని సరి చేయాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు గ్రామస్తులు, రైతులు వేడుకున్నా స్పందించడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పలుచోట్ల పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా అయ్యే తీగలు, బూర్జ లైన్‌కు వెళ్లే విద్యుత్ తీగలు ఒకదానితో ఒకటి రాపిడి జరిగే ప్రమాదకరంగా మారుతోందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కూడా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు అనేకసార్లు సమస్యను విన్నవించుకున్నా ఫలితం శూన్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు పక్కకు ఒరిగిపోయినా, ప్రమాదకరంగా తీగలు కిందకు వేలాడినా, గాలులకు ఎక్కడైనా స్తంభాలు విరిగిపోయినా అధికారులు మాత్రం స్పందించడంలేదని ఆరోపిస్తున్నారు. అలాగే విద్యుత్ శాఖ నిర్వహణకు అత్యవసర సమయంలో కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తారు, కానీ సీతానగరం మండలంలో అలాంటి పరిస్థితి కానరావడం లేదని విమర్శిస్తున్నారు. పైసలు పడితే కానీ పనులు కావనే అపవాదు విద్యుత్ శాఖపై ఇప్పటికే ఉందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు దుక్కు దున్నుకోవడం, విత్తనాలు జల్లుకోవటం ప్రారంభిస్తున్నారని, ఇలాంటి సమయంలో పొలంలో ఉన్న స్తంభాలు పక్కకు ఒరిగి ఉండడంతో దున్నడానికి బిక్కుబిక్కుమంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కిందికి (10అడుగుల ఎత్తులో) వైర్లు వేలాడితే పనులు ఎలా చేయగలుగుతామని ప్రశ్నిస్తున్నారు. పొలం పనులకు వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సత్వరమే పనులు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



బుడ్డిపేటలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగెలు

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు : ఐటిఐ ఆర్‌డిడి

ప్రజాశక్తి-బొబ్బిలి

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తాయని ఐటిఐ ఆర్‌డిడి ఆర్ఎ రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం ఫ్యాషన్ టెక్నాలజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సాంకేతికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఐటిఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. విద్యార్థులను సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు ఐటిఐ, స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు, ఫ్యాషన్ టెక్నాలజీ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. డ్రోన్ టెక్నాలజీ ఐటిఐలో ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో 10 కళాశాలల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సు అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సాంకేతిక విద్య వైపు విద్యార్థులు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమణరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, క్లబ్ ఫౌండర్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, కార్యదర్శి వారాణసి శ్రీహరి, కోశాధికారి ఎస్.శ్రీనివాస్,పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఐటిఐ ఆర్‌డిడి ఆర్ఎ రమణ తెలిపారు. ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సాంకేతిక నైపుణ్యం పెంచేందుకు విశాఖ రీజియన్‌లో బొబ్బిలి, రాజాం, విశాఖ ఓల్డ్ ఐటిఐలో ఫ్యాషన్ టెక్నాలజీ ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ ఐటిఐలలో ఫ్యాషన్ టెక్నాలజీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్క ఐటిఐకి రూ.2కోట్లు వరకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఐటిఐలో ఉన్న ట్రేడ్‌ను ఒక పరిశ్రమకు అనుసంధానం చేస్తామన్నారు

ఘనంగా యోగా దినోత్సవం



యోగా సాధన చేస్తున్న ఐటిడిఎ పిఒ, అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సూర్య యోగా కేంద్రం, పతంజలి యోగా కేంద్రం, బ్రహ్మ కుమారీ సంస్థ, ఇతర శిక్షణా కేంద్రాల సౌజన్యంలో యోగా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి రంగంలో తీవ్ర పోటీ నెలకొందని, దీంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని అన్నారు. శారీరక శ్రమ తగ్గిందని, కావున చిన్న వయస్సు లోనే ఉబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు గురవుతున్నారని, మానసిక ప్రశాంతతకు, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు చదువులో, పోటీ పరీక్షల్లో మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఆటలు, యోగా సాధన చేయించాలని తెలిపారు. దిశా డిఎస్‌పి హర్షిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 20 నిముషాలు శారీరక వ్యాయామం చేయాలని తద్వారా మానసిక, శారీరక సమతౌల్యత కలుగుతుందని తెలిపారు. అనంతరం సూర్య, పతంజలి, బ్రహ్మ కుమారీ సంస్థ ప్రతినిధులు యోగా, ధ్యానం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ బి.సుశీల, డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిపిఆర్ఒ లోచర్ల రమేష్, డిఆర్‌డిఎ పిడి వై.సత్యం నాయుడు, బ్రహ్మ కుమారీ సంస్థ ప్రతినిధి పికె జ్ఞానరత్నం, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ, కార్యాలయాలు, విద్యా సంస్థల్లో యోగా డే నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగా అక్షరరూపంలో ఆసనాలు వేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సూపరింటెండెంట్ జి.పార్వతి, కార్యాలయం ఉద్యోగులు ఆసనాలు వేశారు.

కురుపాం : స్థానిక కోర్టులో పేనల్ అడ్వకేటు బరాటం చంద్రమౌళి ఆధ్వర్యంలో యోగా దినోత్సవన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు యోగసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ప్రతినిధులు షేక్ గౌష్, గౌతారి వెంకటరావు, పారా లీగల్ వాలంటీరు అంధవరపు కోటేశ్వరరావు, కోర్టు సిబ్బంది మంగరాజు, శ్రీనివాసరావు, కురుపాంకు చెందిన పలువురు వ్యాపారులు, ఉపాధ్యాయులు, యోగాభిలాషులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలల్లో యోగా అధ్యాపకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా ఆవశ్యకత వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని పెదమేరంగి కూడలిలో గల తిరుమల సాయి హై స్కూల్ విద్యార్థులకు యోగా డే నిర్వహించారు. అంతేకాక పాఠశాలలో యోగా తరగతిని తప్పనిసరి చేస్తూ గత కొన్నేళ్లుగా తమ పాఠశాలలో విద్యార్థులకు నేర్పిస్తున్నామని తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి ఆర్ ఐ టి ఐ లో విద్యార్థులచే ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ యోగా చేయించారు. చదువుతో పాటు యోగా ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని నాలుగో వార్డులో ఎస్ఎన్ఎం నగర్‌లో ఉన్న షిర్డీ సాయి యోగా కేంద్రంలో యోగా గురువు కుమిలి గౌరీ శంకర్రావు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ బి.పార్వతీశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలోకోరాడ నాని సాయి, టి.రవి, పి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు. యోగా పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

సీతంపేట : స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో యోగ డే సందర్భంగా విద్యార్థులు యోగా డే ఆకృతిని ప్రదర్శించారు ఈ నమునాను పలువురుని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.పద్మశ్రీ, వసతిగృహ అధికారి పాలక అమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక వైటిసిలో డిడి అన్నదొర, ఎపిఒ గణేష్, తహశీల్దార్ మహేశ్వరరావు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్ శిక్షణ విద్యార్థులు యోగాసనాలు వేశారు. అలాగే నాయుడు మల్లి బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పాటు ఉపవిద్య శాఖ అధికారి పాలక నారాయుడు యోగాసనాలు వేశారు.

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను ప్రిన్సిపల్ రఘుపత్రుని శివకుమార్ వివరించారు. వ్యాయమ ఉపాధ్యాయులు జి.శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బాబురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బూర్జి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి టి హేమాక్షి ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. అలాగే సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి ఆధ్వర్యంలోనూ, కోట సీతారాంపురం ఉన్నత పాఠశాలలో ఎంఇఒ జి.సూరిదేముడు ఆధ్వర్యంలో యోగాను విద్యార్థులకు నిర్వహించారు.

వీరఘట్టం : మండలంలోని నడుకూరులో ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం యోగ కార్యక్రమం నిర్వహించారు. వీరఘట్టంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల, తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గడగమ్మ ఎంపి యుపి పాఠశాలలో యోగా నేర్పించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, ప్రధానోపాధ్యాయులు సుంబోరా, యు.అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మక్కువ : మండలంలోని చప్పబుచ్చంపేట పంచాయతీలోని అమృత సరోవర్ ట్యాంక్ దగ్గర, యోగా దినోత్సవం ఎంపిడిఒ దేవకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ యోగా కార్యక్రమంలో గ్రామస్తులు, వేజ్ సీకెర్స్ ఉపాధి హామీ ఎపిఒ ఈశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో యోగాడే ఆకృతిలో ఉన్న విద్యార్థులు



కురుపాంలో యోగా ఆకృతిలో ఉన్న విద్యార్థులు



పీతానగరంలో జెడ్పీ హైస్కూల్లో యోగా చేస్తున్న విద్యార్థులు



సాలూరులో యోగా ఆకృతిలో ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి
www.prajasakti.com



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

త్వరిత గతిన సిసి రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సిసి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ కాంట్రాక్టర్ డి.తిరుపతిరావుకు సూచించారు. పట్టణంలోని 26వార్డులో గల పందావీధి, తెలికులవీధి మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, పనులు జరిగేలా క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. పలు వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు కూడా సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు మండలంలోని దుమ్మంగి పంచాయతీలో ఉపాధి హామీ చట్టం ద్వారా ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 2024-25లో 24మంది రైతులకు 24 ఎకరాల్లో జీడీ, మామిడి తోటలు పెంపకం, జాబ్ కార్డు కొత్తగా నమోదుపై రైతులకు వివరించారు. ఉపాధి హామీ చట్టంలో తోటల పెంపకం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందన్నారు. సర్పంచ్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి జలవనరుల, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలతో అభివృద్ధి జరగడానికి వీలుంటుందని అన్నారు.



చిన్నారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కూనేరు రామభద్రపురం, దేవుకోన, కోటిపాం, ఉలిపిరి, కొరిశీల, పెడ్డ, మసిమండ సచివాలయాల పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం సిడిపిఒ సుగుణ కుమారి ఆదేశాల మేరకు సెక్టార్ సూపర్ వైజర్లు శారదాంబ, అరుణ, ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా లబ్ధిదారులకు వారి పిల్లలకు సమావేశపరిచి గత సంవత్సరంలో పిల్లలు అంగన్వాడీ కేంద్రాల్లో ఏం నేర్చుకున్నారు. వారి ఎదుగుదలకు ఎలా సహాయపడింది అనే దానికోసం ఆయా పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని లబ్ధిదారుల తల్లులతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో స్వేచ్ఛ పూరితమైన విద్యను అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు ఒకటో తరగతిలో అర్హత పొందిన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పి.రాజేశ్వరి, పి.మంజుల, ఎ.సుందరమ్మ, రమణమ్మ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.



గోతుల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అడుగడుగుకూ ప్రమాదం... గంట గంటకూ ట్రాఫిక్

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్రా - ఒడిశా అంతర్రాష్ట్ర రహదారిపై అడుగడుగున ప్రమాదం గంట గంటకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. శుక్రవారం కొమరాడ వద్ద అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతుల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఈ రహదారి వెంట ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సారి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆందోళన చేసేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఈ రోజు తలపెట్టిన రాస్తారోకో ఈనెల 25కు వాయిదా వేస్తున్నామని తెలిపారు. ఆ రాస్తారోకోలో ఎటువంటి ఇబ్బంది జరిగినా పూర్తి బాధ్యత రోడ్లు, భవనాల శాఖ అధికారులదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి శివ నాయుడు, మరడాన శంకర్రావు, ఉపేంద్ర, ఆటో యూనియన్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.



అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు జయరాం

అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని తుమరాడకు చెందిన జనసేన నాయకులు పడాల జయరాం కుమార్తె పడాల తేజస్విని జన్మదిన వేడుకలు సందర్భంగా చింతాడలోని వృద్ధాశ్రమ, అనాథ ఆశ్రమం, పార్వతీపురం మండలంలో గల ఆశాజ్యోతి అనాథ ఆశ్రమంలో అనాథ పిల్లలకు పండ్లు ఇతర నిత్యవసర వస్తువులను కుటుంబ సభ్యులతో కలిపి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులేని పిల్లలు అప్పుడప్పుడు తల్లిదండ్రులుగా మనం వెళ్లి పలకరించడంవల్ల వారు పొందే సంతృప్తి మాటల్లో చెప్పలేమన్నారు. పిల్లలకు గొప్ప ఆదరణ కలిగించే ప్రేమ మనం మన పిల్లల పుట్టిన రోజు సమయంలో గాని, ఇతర రోజుల్లో గానీ అనాథ పిల్లలకు అండగా నిలిచే వీలైనంత సహాయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో జీవితాలు నాశనం

బొబ్బిలి : గంజాయితో జీవితాలు నాశనం అవుతాయని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బివి మురళీధర్ అన్నారు. గంజాయికి వ్యతిరేకంగా గొల్లపల్లి జంక్షన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సహారా డిపాజిటర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సహారా డిపాజిటర్లను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిపాజిటర్లు ఎం.నాగేశ్వరరావు, అనుపోజు చిరంజీవి, చిట్టూరి సత్యనారాయణ, రవ్వా సూర్యనారాయణ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సహారా డిపాజిటర్లను అన్ని విధాలా ఆదుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు. సహారా గ్రూపులకు చెందిన నాలుగు సంస్థల నుంచి దేశవ్యాప్తంగా పేదల నుంచి వసూలు చేసిన డబ్బును 2023లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 45 రోజుల్లో పరిష్కారం చేస్తామని చెప్పి నేటికీ పట్టించుకోకపోవడం సరైనది కాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంస్థల పట్ల నిర్లక్ష్య ధోరణి ఉండడం వల్ల పుట్టగొడుగుల్లాగా ప్రైవేట్ సంస్థలు పుట్టుకొచ్చి పేదలను నుంచి డబ్బులు కాజేసి మోసగిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పేదల



విలేకరులకు బాండ్లను చూపుతున్న డిపాజిట్‌దార్లు

డబ్బులు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మండలంలో దాదాపు 350 మందికి పైగా డిపాజిటర్లు ఉన్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన సహారా సంస్థల నుంచి కాజేసిన సొమ్మును ప్రజలకు ఇప్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సహారా లో డిపాజిట్ చేసిన బాండ్లను విలేకరులకు చూపించారు.

గెడ్డ ఆక్రమణలు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటలో కొండ నుంచి రైల్వే ట్రాక్ గెడ్డ నుంచి వచ్చిన నీరు రాకుండా కొందరు వ్యక్తులు గెడ్డలను ఆక్రమించుకున్నారు. దీనిపై ఈనెల 16న ఆ గ్రామానికి చెందిన రైతులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆక్రమణను పరిశీలించేందుకు శుక్రవారం సర్వేయర్ గ్రామానికి వచ్చి సర్పంచ్ సమక్షంలో సర్వే చేశారు. సర్వే అనంతరం నివేదికను విఆర్ఒ శ్రీకాంత్‌కు అప్పగించారు.

బ్యాంకు మేనేజర్ బదిలీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ పాండ్రంకి రవికుమార్‌కు బదిలీ అయ్యింది. మూడేళ్లుగా సీతంపేటలో పనిచేసి విజయనగరంజిల్లా నెల్లిమర్ల మండలం జర్జాపుపేట బ్రాంచ్ కు బదిలీపై వెళు తున్నారు. ఈమేరకు బ్యాంకు మేనేజర్‌కు ఎపిఎం, సిసిలు, బ్యాంక్ సిబ్బంది సాలువాతో సత్కరించి సన్మానించారు. ఖాతాదారులకు ఎప్పుడు అందుబాటులో ఉండే వారిని, ప్రజలతో రవికుమార్ మమేకమయ్యారని అన్నారు. కార్యక్రమంలో ఫీల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, క్యాషియర్ సంతోషి లక్ష్మి, ఎపిఎం విజయ కుమారి, సిసి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



అసౌకర్యాలకు నిలయంగా ఉన్న బిసి బాలుర వసతిగృహం

సంక్షేమానికి నీటి కష్టాలు

ప్రజాశక్తి-పాలకొండ

పేద విద్యార్థులు తల దాచుకుంటున్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. దీనివల్ల పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో బిసి బాలుర వసతి గృహంలో సుమారు 25మంది విద్యార్థులు ఉండగా, అక్కడ పూర్తిగా నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. వ్యక్తిగత అవసరాల్ని తీర్చుకొనేందుకు కూడా నగరపంచాయితీ ద్వారా వచ్చే నీటి ట్యాంక్ మీదే ఆధారపడుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకునే పరిస్థితి మాత్రం లేదు. సంక్షేమ వసతి గృహం నిర్మించిన ప్రభుత్వం నీటికోసం సరైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు తమ అవసరాలు తీర్చుకొనేందుకు ఆరు బయటకు వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు కానీ, పాలకులు కానీ ఈ సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో విద్యార్థులు తమ సమస్యలు ఎప్పుడు తీరుతాయని ఎదురుచూస్తున్నారు.



నీరు లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఉపాధ్యాయ వృత్తి సంతృప్తినిచ్చింది

హెచ్ఎం గెంబలి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

40 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తి తనకెంతో సంతృప్తినిచ్చిందని ఠాగూర్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గెంబలి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే...

పార్వతీపురం రాయగడ రోడ్ కొత్త వీధికి చెందిన గెంబలి గురునాథస్వామి, సరోజనమ్మ దంపతులకు తాను మూడో సంతానం. స్థానిక గెంబలి వారి వీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్య, ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు ఆర్‌సిఎం హై స్కూల్, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోపూర్తి చేశాను. శ్రీకాకుళం జిల్లా వమరవిల్లిలో టిటిసి చేశాను. 1985లో పట్టణంలోని పెద్ద మాదిగ వీధి ఎలిమెంటరీ మున్సిపల్ స్కూల్లో ఎస్‌జిటిగా నా తొలిత ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. ఇక్కడ దుర్గంధంతో ఉన్న పాఠశాలను పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి పిల్లలు బడికి వచ్చేలా తీర్చిదిద్దడంలో సంతృప్తి కలిగింది.



ఇక్కడ కొన్ని నెలలు మాత్రమే విధులు నిర్వహించి అదే ఏడాదిలో నేతిల వారి వీధి మున్సిపల్ ఎలిమెంట్రీ స్కూల్‌కు బదిలీ అయింది. ఇక్కడ 25 ఏళ్ల పనిచేసి 2010లో నేను చదువుకున్న గెంబలి వారి వీధి మున్సిపల్ స్కూల్లో బోధనలు అందించే అరుదైన అవకాశం కలగడం చాలా సంతృప్తి చెందాను. ఇక్కడ రెండేళ్ల పనిచేసి 2012లో ఠాగూర్ మున్సిపల్ స్కూల్‌కు బదిలీపై వచ్చి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్నాను.

స్థానికంగా 40 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో సీనియారిటీతో 30 ఏళ్లు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి నాడు-నేడులో ఎనిమిది లక్షలతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దాను. సహచర ఉపాధ్యాయులు అన్ని విధాలా సహకరించి పనిచేయడం వారికి నా కృతజ్ఞతలు. నా వద్ద చదువుకున్న విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లుగా పనిచేయడం, వారు ఎదురుపడేటప్పుడు మాస్టారు పలకరింపులో పొందిన ఆనందం మరువలేనిది. నా భార్య భానుమతి అన్ని విధాలా సహకరించడంతో ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్ల చేసి, కుమారుడు సాయి గణేష్ బిటెక్ చదివించి హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో సఫలీకృతుడినయ్యాను. స్థానిక కన్యకా పరమేశ్వరి కోవెలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం, రోగులకు మందులు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేయడం నాకేంతో ఇష్టం. ఉద్యోగ విరమణ అనంతరం కూడా పిల్లలకు విద్యాబోధనలు అందిస్తాను.



కురుపాం : గుమ్మలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మల్లిలో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - సీతంపేట

'నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పిల్లలందర్నీ బడికి పంపాలే తప్ప పనికి కాదని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి అన్న దొర పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాల్లో అగ్రహించవచ్చన్నారు. పేదరికం నిర్మూలించేది ఒక్క చదివానని చెప్పారు. విద్యార్థులతో డిడి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రతి విద్యార్థిని బడికి పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పించిందని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పి.నారాయుడు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎఎంఒ పి.కోటిబాబు, సిఎంఒ చిరంజీవిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లను చదివిద్దాం ఆడపిల్లను రక్షిద్దాం

కురుపాం : ఆడపిల్లను చదివిద్దాం... ఆడపిల్లలను రక్షిద్దాం అనే కార్యక్రమంలో భాగంగా సిడిపిఒ కె.విజయ్‌గౌరి మండలంలోని నీలకంఠాపురం, టొంపలపాడు, గుమ్మ, మొండెంఖల్, గుమ్మడిగూడ, కురుపాంలో శుక్రవారం ర్యాలీ అవగాహన కార్యక్రమలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ కళా జాతా, ర్యాలీ ద్వారా ఆడపిల్లల చదువు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



ఖరీఫ్ దుక్కులను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

అదును చూసి నారు పోసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

రుతుపవనాలు ఇంకా పూర్తిగా వ్యాప్తి చెందని నేపథ్యంలో రైతులు అదును చూసుకొని మాత్రమే వరి విత్తనాలు నారు పోసుకోవాలని, లేకుంటే ముదురు నారు నాటు కోవాల్సిన పరిస్థితి ఏర్పడి దిగుబడులు తగ్గే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని విశ్వనాధపురం, పనుకువలస, క్రివలస, కూనం బంధవలస రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తన సరఫరాను పరిశీలించిన అనంతరం పత్తి పంట క్షేత్ర సందర్శన చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ 20 రోజుల నారు నాటుకున్నట్లయితే వరి పంట దిగుబడి బాగుంటుందన్నారు. కావున తొందరపడి నారు పోసుకోవద్దని, అదును చూసుకొని మాత్రమే నారు పోసుకోవాలని తెలిపారు ఏరువాక పౌర్ణమి సందర్భంగా దుక్కులు దున్నుతున్న రైతులను కలిసి పత్తి పంటపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆర్‌బికెల్లో 300 టన్నుల యూరియా, 150 టన్నుల డిఎపి సిద్ధంగా ఉందని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. పత్తిలో అంతరకృషి ద్వారా మాత్రమే కలుపు నివారణ చేపట్టాలని, కలుపు రసాయనాలు వాడితే పత్తి దిగుబడి రెండు క్వింటాళ్లకు పైగా తగ్గిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు మోహన్, అశ్విని, లావణ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వార్డుల్లో గల కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించేందుకు శుక్రవారం నాడు సంబంధిత కాంట్రాక్టర్ ప్రైవేట్ సిబ్బందితో ముమ్మరం చేశారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.5లక్షలు వెచ్చించి గత కొన్ని రోజులుగా సంబంధిత కాంట్రాక్టర్ ప్రైవేటు సిబ్బందిచే పూడికలను తొలగిస్తున్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, ప్రజారోగ్య శాఖ విభాగం అధికారి సిహెచ్ మురళితో కలిసి 26వ వార్డులో జరుగుతున్న పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పూడికతీత పనులు జరుగుతున్నప్పుడు ఆయా అవార్డుల సచివాలయాల శానిటరి సెక్రటరీలు, ప్రజారోగ్య సిబ్బంది పర్యవేక్షించి, పూర్తిస్థాయిలో తొలగించేటట్లు చూడాలని అన్నారు.

చేసిన సేవలు గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో 39 ఏళ్లుగా ప్రధానోపాధ్యాయులు కె.సుబ్బారావు గిరిజన విద్య కోసం అహర్నిలూ పాటుపడ్డారని డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర అన్నారు. మండలంలోని ధోనుబాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో డిడితో పాటు సిబ్బంది శాలువతో సత్కరించి సన్మానించారు. అనంతరం డిడి మాట్లాడుతూ సుబ్బారావు నిరాడంబరంగా ఉంటారని, గిరిజన విద్య కోసం మారుమూల గ్రామాల సైతం వెళ్లి ఉద్యోగం చేస్తూ గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.దేశ్, సిబ్బంది ముకుంద, ప్రసాద్, మోహన్‌రావు, బాలు తదితరులు పాల్గొన్నారు



సీతంపేట : అవగాహన ర్యాలీలో పాల్గొన్న సిఐ, ఎస్ఐ, వాహనచోదకులు

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపేవారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు అన్నారు. శుక్రవారం నీలకంఠాపురం, మొండెంఖల్‌లో వాహనచోదకులకు అవగాహన కల్పించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేసి, సంబంధిత ధ్రువపత్రాలు పరిశీలించారు. లైసెన్స్ పత్రాలు లేని వారిపై కేసులు నమోదు చేశారు. మద్యం తాగి, చరవాణిలో మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనచోదకులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ ఎం.జగదీష్ నాయుడు తన సిబ్బంది కలిసి ప్రజలతో మమేకమై రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆటో, మ్యాక్సీ , మినీ వ్యాన్ డ్రైవర్లతో పాటు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం సిఐ, ఎస్ఐలు రోడ్ సేఫ్టీ రూల్స్, రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు.

అనుమతుల్లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎపి విద్యార్థి జెఎసి ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ శ్రీచైతన్య జూనియర్ కళాశాల భవన నిర్మాణంలో ఉంటుండగా 200 మంది పైగా విద్యార్థులతో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే అక్కడ ఉండే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రాణహాని ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే సదరు కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలో పుస్తకాలు, యూనిఫాంను కళాశాల పేరు ముద్రించి విక్రయిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం పెట్టిన ఫీజులు కన్నా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆర్ఐఒకు రెండు రోజుల క్రితం ఈ విషయాన్ని తెలియజేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, రాజేష్, మహేష్, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



బోల్తాపడిన ఆటో

ఆటో బోల్తా; ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

ఆటో బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం నీలకంఠపురం పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. అదే రహదారి వెంట వెళ్తున్న ఫీడర్ అంబులెన్స్ ఇఎంటి ప్రవీణ్ కుమార్ అందించిన వివరాలు ప్రకారం ధర్మలక్ష్మీపురం నుండి నీలకంఠపురం వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న మ్యాక్స్ క్యాబిన్ తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఆటోలో ఉన్న హిమరిక కృపారావు (35) కాలు, చేయి విరిగింది. క్షతగాత్రుడ్ని ఫీడర్ అంబులెన్స్ ద్వారా నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

గంట్యాడ : గంట్యాడలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు శీర గణేష్ (3) అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కొండగుంపాం గ్రామం నుంచి శీర శ్రీను, మౌనిక, బాలుడు గణేష్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. శృంగవరపుకోట నుంచి విజయనగరం వైపు వస్తున్న కారు వీరిని ఎదురుగా ఢీకొంది. దీంతో బాలుడు గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీను, మౌనికతోపాటు కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీను పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు తరలించారు.

కోనేరులో కాలు జారిపడి వ్యక్తి మృతి

వంగర : స్నానానికి వెళ్లి ప్రమాదవశాస్తు కాలు జారిపడి వ్యక్తి మతి చెందిన ఘటన మండలంలోని అరసాడలో శుక్రవారం జరిగింది. అరసాడ గ్రామానికి చెందిన దవరసింగి మహేష్ (33) గ్రామ శివాలయం వద్ద ఉన్న నారప్ప కోనేరు వద్దకు స్నానం చేసేందుకు వెళ్లాడు. కాలుజారి కోనేరులో మునిగిపోవడంతో గమనించిన స్థానికులు మహేష్‌ను బయటకు తీసి రాజాంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహేష్ మృతి చెందాడు